# ప్రేమను అందించు ప్రేమకై

-మల్లాది రమాంజలి

"సుధా! నా మాట వినరా. ఆ పసిదాని ముఖం చూసైనా నీ నిర్ణయం మార్చుకోరా" సుధాకర్‌కు నచ్చచెప్పబోయాడు.

"లేదురా కార్తీ... ఈ విషయంలో నా నిర్ణయం మారదు. శ్రీదేవిని నేను మర్చిపోలేకపోతున్నాను. ఆమె ఇచ్చిన మా ప్రేమఫలం మేఘనకి అన్యాయం చేయలేను. సవతి తల్లి చేతుల్లో చూస్తూ చూస్తూ దాన్ని పెట్టలేను. పాప ఆలనాపాలనా మా అమ్మ చూస్తోంది. రోజులు ఇలాగే జరిగిపోనీ" నిర్వేదంగా అన్నాడు సుధాకర్.

"పడమటికి దిగుతున్న సూర్యుని లాంటి అమ్మ పాపను జీవితాంతం కనిపెట్టుకుని ఉండగలదనా నీ ఉద్దేశ్యం? శ్రీదేవి గతించిన నీ జీవితానికో తీపి గుర్తు. తన మజిలీ ముగించుకుని వెళ్లిపోయింది. ఆ రోజులే తల్చుకుంటూ గడిపేస్తే పాప ఏమవుతుందో ఆలోచించు."

"పాప తల్లినే గుర్తు చేసుకుంటూ పిచ్చిదైపోతుందేమోనని భయంగా ఉందిరా. ఒక్కోనాడు నిద్రలో ఉలిక్కిపడి లేచి అమ్మ కావాలని మారాం చేస్తుంది. ఓ రోజు స్కూలుకు వెళ్లనని పేచీ పెడుతుంది. అమ్మే కావాలి, నాన్నమ్మ వద్దంటుంది. ఆఫీస్‌కి వెళ్లినా నా మనసంతా మేఘన చుట్టూనే తిరుగుతూ వుంటుంది. పరిస్థితులను అర్థం చేసుకునే వయస్సు రాని పిల్ల. రోజులు ఎలా గడుస్తాయోననే దిగులు."

"అన్నీ ఆలోచించే చెబుతున్నాను. నీవు వయసైనవాడివి కాదు. నీకు భార్యగా కాకపోయినా పిల్లకు తల్లిగా ఉండే అమ్మాయిని చూసి చేసుకో. ఒక గూటిలో ఉండబోయే మీ ఇద్దరూ ఒకరి మనసులు ఒకరు అర్థం చేసుకుని మంచి భార్యాభర్తలుగా అవ్వచ్చునేమో ఆలోచించు. ఈరకంగానే ఉంటే పాప ఆరోగ్యం కూడా దెబ్బ తింటుంది" సుధాకర్‌ను ఆలోచింపజేయడానికి ప్రయత్నిస్తున్నాను.

"ప్రొద్దుట లేచిన దగ్గర్నుంచీ రాత్రి పడుకునే వరకూ తల్లిని తలుస్తూనే వుంటుంది. మమ్మీ నాకు చక్కగా చదువు చెప్పేది డాడీ. మీరు చెబుతుంటే నాకు అర్థం కావడంలేదు. మమ్మీ నన్ను చాలా బాగా డ్రెస్ చేసేది డాడీ. నాన్నమ్మకు ఏమీరాదు. మమ్మీ ఎందుకు ఎక్కడికి వెళ్లిపోయింది డాడీ" వెక్కి వెక్కి ఏడ్చే మేఘనకి ఏం సమాధానం చెప్పి మరిపించాలో నాకు అర్థం కావడంలేదు" సుధాకర్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"అందుకే అన్నీ ఆలోచించే నీకు చెబుతున్నాను. నేను చెప్పిన సలహా గురించి మళ్లీ ఆలోచించు" అంటూ ఇంటికి వెళ్లడానికన్నట్లు లేచాను.

కారులో సుధాకర్ మౌనంగా ఉన్నాడు. అతని చేతులు స్టీరింగ్ మీదున్నా ఆలోచనలు మాత్రం ఎటో పరిభ్రమిస్తున్నాయని గ్రహించాను. నన్ను మా ఇంటి దగ్గర డ్రాప్ చేసి సుధాకర్ వెళ్లిపోయాడు.

★★★

శ్రీదేవి, సుధాకర్‌లది ప్రేమ వివాహం. ఇద్దరూ జంట పక్షుల్లా ఒకరిని విడిచి ఒకరు ఉండలేనట్లుగా ఉండేవాళ్లు.

అందరం వాళ్లని ఆదర్శ జంటని చెప్పుకునే వాళ్లం. వాళ్ల ప్రేమఫలం మేఘన పుట్టిన ఐదేళ్లవరకూ బాగానే వుంది శ్రీదేవి.

ఆ తరువాత ఆమె ఆరోగ్యం పాడైపోయింది. బ్రెన్ ట్యూమర్ అని డాక్టర్స్ తేల్చి చెప్పాక గుండె నీరైపోయింది సుధాకర్‌కి.

ప్రాణంలా చూసుకుంటున్న భార్య ఏ క్షణంలో విడిచి పోతుందోనని బాగా దిగులు పడ్డాడు. కంటికి రెప్పలా చూసుకుంటూ తిండి, నిద్ర లేకుండా భార్యకు సేవలు చేసేవాడు. కానీ విధిని ఎవరు తప్పించగలరు...? భార్య మరణం సుధాకర్‌ని ఎంతగానో కృంగదీసింది. లోకమంతా చీకటైనట్లు అనిపించింది.

తండ్రి చిన్నప్పుడే దూరమవడం, తల్లి తన దగ్గరే ఉండడంతో మేఘన ఆలనా పాలనా ఆమెకే అప్పచెప్పక తప్పలేదు.

మళ్లీ పెళ్లి చేసుకుంటే పిల్లను ఆ వచ్చిన ఆమె చూసుకుంటుందని ఆశపడి ఆమె సుధాకర్‌ని పోరు పెట్టసాగింది. అందుకు ఒప్పుకోలేదు సుధాకర్. మేఘనను సవతి తల్లి చేతుల్లో పెట్టడం తనకు ఇష్టం లేదన్నాడు.

అతన్ని ఒప్పించడం సాధ్యం కాక దైవంపై భారం వేసి ఊరుకుంది అతని తల్లి సుగుణమ్మ. సాయంత్రం కాగానే గుబులు మొదలయ్యేది సుధాకర్‌కి.

శ్రీదేవి ఆలోచనలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసేవి. ఒక్కోరోజు ఆలోచనలతో గుండె బరువెక్కి నిద్ర మాత్రలను అలవాటు చేసుకున్నాడతను.

కొడుకు బాధను సుగుణమ్మ గమనిస్తూనే వుంది. కానీ ఏం చేయగలదు. కోడలు బంగారు బొమ్మే కాకుండా తనను కన్నతల్లికంటే ఎక్కువగా ప్రేమించేది.

అంతటి ప్రేమను పంచుతున్న కోడలంటే ఆమెకీ అభిమానం గానే వుండేది. మహాలక్ష్మిలా కళకళలాడుతూ తిరుగుతున్న కోడలు హఠాత్తుగా తమను విడిచిపోవడం ఆమెకూ భరించలేని కష్టంగానే వుంది.


మళ్లీ పెళ్లి చేసుకుంటే ఈ బాధను క్రమంగా అను మరచిపోగలడని ఆశించిన ఆమెకు ఆశా భంగం అయిందనే చెప్పాలి.

కాలం గాయాలను మాన్పుతుందని మనస్సుకు సర్దిచెప్పుకుని మంచి రోజు కోసం ఎదురు చూస్తోంది సుగుణమ్మ.

***

ఆఫీస్‌కి బయలుదేరుతుండగా సుధాకర్ నుంచి త్వరగా రమ్మని ఫోన్ రావడంతో ఆటోలో బయలుదేరాను.

ఇంటికి చేరుకునేసరికి అంబులెన్స్ వాకిట్లో వుంది.



సుగుణమ్మగారికి ఏమయిందో అనుకుంటూ కంగారుగా లోపలకు అడుగుపెట్టాను.

తల్లిని మరో మనిషి సాయంతో లేపుతున్నాడు సుధాకర్. గబగబా నేను కూడా ఓ చేయి వేసాను. పాల రాయిమీద కాలు జారి పడడంతో బహుశా కాలు ఫ్రాక్చర్ అయిందనుకుంటాను. సుగుణమ్మగారు లేవలేని పరిస్థితిలో ఉన్నారు.

అదే విషయం చెప్పాడు సుధాకర్. ఆమెను తను హాస్పిటల్‌కు తీసుకువెళతానని, మేఘనని ఇంట్లో దింపి ఆ తరువాత హాస్పిటల్‌కు రమ్మని నాతో చెప్పి కంగారుగా అంబులెన్స్ ఎక్కాడు సుధాకర్.

నాయనమ్మకు ఏమయిందో తెలీక ఓ మూలగా నిల్చుని వెక్కివెక్కి ఏడుస్తోంది మేఘన.

చెదిరిపోయిన పాప జుట్టును సరిచేసి కళ్లు తుడిచి హృదయానికి హత్తుకున్నాను.

అప్పటివరకూ ఉగ్గపట్టుకుని ఉన్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికినట్లుగా నన్ను కౌగలించుకుని బావురుమంది మేఘన. భయపడవద్దని చెప్ప పాపను ఎత్తుకుని ఆటోలో కూర్చోబెట్టాను.


ఇంటికి వెళ్లేవరకు పాప ఏడుస్తూనే వుంది.

ఫోన్‌లో అన్ని విషయాలూ నా భార్య రజితకు చెప్పాను. ఆటో దిగగానే మాకు ఎదురు వచ్చి మేఘనను ఇంట్లోకి తీసుకువెళ్లింది రజిత. వచ్చిన ఆటోలోనే మళ్లీ హాస్పిటల్‌కేసి బయలుదేరాను.

***


సుగుణమ్మగారికి కాలు ఫ్రాక్చర్ అయిందని, మూడు నెలలు బెడ్ దిగవద్దని డాక్టర్లు చెప్పడంతో ఆమెను చూసుకోవడానికి ఓ నర్స్‌ను ఏర్పాటు చేసాడు సుధాకర్.

రోజూ రజిత కేరియర్ పంపడంతో వంట పని తప్పింది సుధాకర్‌కి.



## టీచర్ అవతారం

రామ్‌గోపాల్ వర్మ తీస్తున్న 'రక్తచరిత్ర'లో హిందీ హీరో వివేక్ ఓబెరాయ్‌తోపాటు తమిళ హీరో సూర్య కూడా నటిస్తున్నాడు. ఈ సినిమా హిందీ వెర్షన్‌లోనూ వీళ్లే వుంటారట. అందుకని తన పాత్రకి తనే డబ్బింగ్ చెప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాట్ట సూర్య. ఇంట్లో అతని భార్య జ్యోతిక హిందీ పాఠాలు తెగ చెబుతోందిట. ఆమె ముంబయ్ చిన్నది కదా! హిందీ డైలాగులు స్పష్టంగా చెప్పేందుకు భార్య దగ్గరే నేర్చుకుంటున్నాట్ట సూర్య.




ఎక్కువ రోజులు స్నేహితుని మీద ఆధారపడడం ఇష్టంలేని సుధాకర్ ఓ వంటమనిషిని ఏర్పాటు చేసుకున్నాడు.

మేఘనను మాత్రం మా పిల్లలతోపాటు వుంటుందని మా దగ్గరే వుంచుకున్నాం.

ఆఫీస్‌కి వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు మేఘనను చూసి వెళుతున్నాడు సుధాకర్ క్రమం తప్పకుండా . మేఘన మా పిల్లలతో చాలా త్వరగానే కలసిపోయింది.

ఇన్నిరోజుల తరువాత సంతోషంగా ఉన్న పాపను చూస్తుంటే సుధాకర్‌కి తృప్తిగా ఉంది. పాప కూడా తండ్రిని, తల్లిని పెద్దగా తలవకపోవడం గమనించాను.

పాపకు సరైన తోడుంటే ఎంతటి దుఃఖాన్నయినా మరచిపోగలదని అర్థం చేసుకున్నాం నేను, సుధాకర్.

ఓ రోజు సాయంత్రం ఆఫీస్ నుంచి నేరుగా మా ఇంటికి వచ్చిన సుధాకర్‌కి ఎదురెళ్లి "డాడీ!" అంటూ గట్టిగా పెనవేసుకుపోయింది మేఘన. మా అమ్మాయి చందన తను దాగుడుమూతలు ఆడుతున్నామని తను చందనను పట్టేసుకున్నానని హుషారుగా చెప్పింది మేఘన. తల్లి పోయాక మేఘనను అంత సంతోషంగా ఎప్పుడూ చూడలేదు.

అతని కళ్లు తృప్తిగా మెరిసాయి.

కృతజ్ఞతగా నా కళ్లల్లోకి చూసాడు సుధాకర్. మంచి మూడ్‌లో ఉండడం చూసి ఇదే సరైన సమయమని భావించి పెళ్లి గురించి మళ్లీ ప్రస్తావించాను.

"పాపను చూడడం నీకు కష్టంగా ఉందనుకుంటాను. అందుకే నీకెలాంటి కష్టం లేకుండా త్వరలో ఒక ఆయాను కూడా మాట్లాడాలనుకుంటున్నాను" అన్నాడు.

"అబ్బే అది కాదురా. పాప మాకు అడ్డు కాదు. నీవు దయచేసి వేరుగా అనుకోవద్దు. మా ఇంట్లో పాప ఎంత సంతోషంగా ఉందో గమనించే వుంటావు. తల్లి లేకపోవడం, తోడులేకపోవడంతో స్తబ్దుగా అయిపోయింది పాప. అదే సరైన తోడుంటే పాప ఆరోగ్యంగా నవ్వుతూ కళకళలాడుతూ వుంటుంది. సవితి తల్లులందరూ ఒకేరకంగా ఉండరు. పోనీ కష్టం, సుఖం తెలిసిన ఏ అనాధనో చేసుకో" మెల్లగా చెప్పాను సుధాకర్ ఆలోచనలో పడ్డాడు.

***

వేసవి సెలవులు ఇవ్వడంతో అమ్మమ్మగారి ఊరు వెళదామంటూ పిల్లలు గొడవ చేయడంతో వారంరోజులు సెలవు తీసుకుని రజిత, పిల్లలతో బయలుదేరాను.

మేఘనను సుధాకర్ దగ్గర దింపుదామనుకుంటుండగా తండ్రితో వెళ్లనని మాతో ఊరు వస్తానని మారాం చేసింది.

అంకుల్, ఆంటీని ఇబ్బంది పెట్టవద్దని పాపకు నచ్చచెప్పడానికి ఎంతగానో పయత్నించాడు సుధాకర్.

పాప ఉంటానని ధైర్యంగా చెబుతుంటే సుధాకర్‌కి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. పాప మాకు ఇబ్బంది ఏమిటని సుధాకర్‌కు నచ్చచెప్పి మాతో పాటు ఊరు తీసుకువెళ్లాం.

తల్లిలేని పిల్ల అని తెలియడంతో అత్తగారు ఇంత చిన్న వయసులో తల్లిని కోల్పోవడం ఎంత దుర్భరమోనని బాధపడ్డారు. మా అత్తగారికి ఆ వారంరోజుల్లోనే మేఘనపై అమితమైన ప్రేమ ఏర్పడింది. మా పిల్లలతో ఆ పిల్ల కూడా అమ్మమ్మ అమ్మమ్మ అంటూ వెంట తిరగడంతో ముచ్చటపడి

పోయారావిడ.

పల్లెటూరిలో లంకంత పెద్ద ఇంట్లో మీరొక్కరుండవద్దని మాతో వచ్చేయండని చెప్పాను.

తను ఒంటరిగా లేనని, తమ దూరపు బంధువులైన ఓ తల్లీకూతుళ్లకి రెండు గదులు అద్దెకిచ్చానని, వాళ్లతో తనకు కాలక్షేపం బాగానే అవుతోందని చెప్పారావిడ. అప్పుడే పక్క వాటా నుంచి చిన్నబాబు ఏడుపు వినబడుతోంది.

"పారూ! బాబు ఏడుస్తున్నాడమ్మా... త్వరగారా" పెద్దామె కంఠం వినబడుతోంది.

"పారూ...ఎవరమ్మా. నాకు తెలియని బంధువులు ఎవరున్నారు మనకు?" రజిత ప్రశ్నించింది.

"నర్సాపురంలో కుటుంబరావుగారని మా ఇంటికి ఎదురుగా ఉండే వాళ్లు వాళ్ల మనవరాలే పార్వతి. పాపం పార్వతికి భర్త లేడు. మూడు సంవత్సరాలక్రితమే పెళ్లి అయిందిట. వెంటనే బాబు పుట్టాడు. బాబుకి ఐదోనెల రాగానే అత్తవారింటికి పంపింది వాళ్ల అమ్మ ఆదిలక్ష్మమ్మ. ఏదో కుటుంబ కలహాలవల్ల పార్వతి భర్త ఉరేసుకుని చనిపోయాడట. పాపం చిన్నపిల్ల. చిదిమి దీపం పెట్టవచ్చు. ఆమె అదృష్టం బావుండి పెళ్లి కాకముందే గవర్నమెంటు టీచర్ ఉద్యోగం ఉండడంతో ఇబ్బంది లేకుండా పోయింది. ఈ ఊరు కొత్తగా ట్రాన్స్‌ఫర్ అవడం, మనింట్లో అద్దెకు దిగడం ఒక్కసారిగా జరిగిపోయినాయి. అన్నీ ఉన్నా ఆ ఒక్క ఐదోతనమే లేకుండా పోయింది ఆమెకు" నిట్టూర్చావిడ.

చిన్నపిల్లవాడి ఏడుపు వినబడడంతో మా పిల్లలు, మేఘన సరాసరి వాళ్లింట్లోకి దూరిపోయారు.

కొంతసేపటికి పిల్లల అల్లరి, నవ్వులు వినపడినాయి మాకు ఇంట్లో నుంచి. చిన్నపిల్లలు ఎవరితోనైనా ఇట్టే కలసిపోతారు అనుకుని రజిత, నేనూ నవ్వుకున్నాం.

***

సాయంసంధ్య ఆహ్లాదంగా ఉండడంతో మేడపై చల్లగాలికి తిరుగుతున్నాను. సన్నగా, తెల్లగా, పొడవుగా ఉన్న ఒకామె బట్టలు తీయడానికి కాబోలు మేడమీదకి వస్తూ నన్ను చూసి కొంచెం వెనక్కి తగ్గింది. బహుశా పార్వతి కావచ్చు.

"ఫర్వాలేదు తీసుకోండి" అని మేడపై మరో మూలకెళ్లి నిల్చున్నాను. ఆమెను ఒక్క నిముషం చూసినా గుర్తుండిపోయేంత అందంగా ఉంది. అంతేకాదు... ఆమెను చూడగానే ఎవరికైనా గౌరవ భావం కలుగుతుంది. ఆమెకు ఓ పాతిక సంవత్సరాలు ఉండవచ్చు.

ఆమె కథ మొత్తం అత్తగారి ద్వారా విని ఉండడంతో ఆమె పట్ల నా మనస్సు సానుభూతితో నిండిపోయింది. మేఘన ఆంటీ అంటూ పార్వతి చుట్టూ ఎక్కువగా తిరగడం, పార్వతి కూడా మేఘనను ప్రత్యేకంగా చూడడం, ఒళ్లో కూర్చోబెట్టుకుని కథలు, కబుర్లు చెప్పడం నేను చాలాసార్లు గమనించాను.

మేఘన తండ్రి, నాన్నమ్మలను తలవకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది నాకు.

పార్వతి కొడుకు రెండేళ్ల వంశీ పిల్లలతో కేరింతలు కొడుతూ ఆడుకుంటుంటే ముచ్చటేసింది నాకు.

వంశీ అచ్చంగా తల్లి పోలికలలోనే ఉన్నాడు. అంత పసి వయస్సులో తండ్రి ప్రేమకు దూరమవడం దారుణమనిపించింది. ఆ పసివాడు ఎంత దురదృష్టవంతుడో అనిపించింది నాకు.

ఒక్కసారిగా మనసులో సుధాకర్ మెదిలాడు. సుధాకర్, పార్వతి ఒకే బాటలో ఉన్న ప్రయాణికుల్లా కనబడ్డారు.

భార్యను కోల్పోయి సుధాకర్, భర్తను కోల్పోయి పార్వతి ఎవరికి వారు మోడుల్లా ఉన్నారు.

సుధాకర్‌ని ఒప్పించి పార్వతితో పెళ్లి చేస్తే... కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టాను. కానీ సుధాకర్ ఒప్పుకుంటాడా? అసలే జగమొండి. పార్వతిని నేను చూసింది ఒక్కక్షణం.

ఆమె ఎలాంటిదో అర్థం లేకుండా ఆలోచిస్తున్నానా? అనిపించింది ఓ క్షణం. నా ఆలోచన రజితకు చెప్పాలనుకుంటూ చీకటి పడడంతో క్రిందకి దిగాను.

***

## భగ్న ప్రేమికులకి బార్

బ్యాంకాక్‌లో భగ్న ప్రేమికుల కోసం ఒక బార్‌ని నడుపుతున్నారుట! అక్కడ కూర్చుని బీరు త్రాగుతూ తమలో తాము దుఃఖపడవచ్చునట. ప్రత్యేక గదుల్లోకి వెళ్ళి తమని మోసగించిన మాజీ ప్రేమికుల ఫోటోల్ని గోడలకి తగిలించుకుని వాటిని కసితీరా బాటిల్స్‌తో కొట్టవచ్చునట. సౌండ్ ప్రూఫ్ గదుల్లో వారి ప్రేమికుల్ని తిట్లతో ముంచెత్తవచ్చునట.


## ఘోర మార్పిడి

ఒకహామాలో ఇటీవల కేథరిన్ స్మిత్ అనే మహిళ తను మనసుపడ్డ పక్కింటివారి చిహూన్ హువా కుక్కపిల్లకోసం తన ఏడునెలల కూతుర్ని వాళ్ళకిచ్చేసిందిట. చట్టపరంగా హక్కులు కూడా వదులుకుంటున్నట్టు వ్రాసిచ్చిందిట. ఆ తల్లి చేసిన దారుణానికి ఆమెకి జైలుశిక్ష పడనుంది!

## తండ్రిని కిడ్నాప్ చేసిన కొడుకు

మలేషియాలో తాంపోయీ టౌన్లో 20 ఏళ్ళ జాకోబ్ జెబారాజ్ అనే విద్యార్థి తన ఐదుగురు స్నేహితులతో కలిసి తండ్రిని కిడ్నాప్‌చేసి తల్లి దగ్గర్నుంచి 13,157 డాలర్లు వసూలు చేసాడుట! ఆ తర్వాత వాళ్ళు దొరికిపోయి జైలుపాలయ్యారన్నది వేరే సంగతి! ఆ దేశ చట్టాల ప్రకారం కిడ్నాపింగ్‌కి మరణశిక్షలు కూడా పడతాయిట!

-తటవర్తి



పార్వతి గురించి నా ఆలోచన రజితకు చెప్పాను.

“పార్వతిని నేనూ మొదటిసారే చూస్తున్నాను. ఆమె ఎలాంటిదో తనకు రెండవ పెళ్లి చేసుకునే ఆలోచన ఉందో లేదో మనకు తెలీదు. అడిగినా ఏమన్నా అనుకుంటారనే భయం... లేనిపోని విషయాల్లో తలదూర్చడం ఎందుకు'' అన్నట్లుగా అన్నది రజిత.

వారంరోజుల నా సెలవు అయిపోవడంతో ఊరు బయలుదేరాను. రజిత, పిల్లలు ఓ పదిహేనురోజుల నుండి ఉండి వస్తామన్నారు. మేఘన నాతో రానని మొండికేయడంతో ఆ విషయమే సుధాకర్‌కి ఫోన్‌లో చెప్పాను.

సుధాకర్‌కి ఏం చేయాలో అర్థం కాలేదు. అయినా సెలవులు పదిహేను రోజులే కాబట్టి రజితతోనే రమ్మని చెప్పడంతో చేసేదేంలేక నేను ఒక్కడినే బయలుదేరాను.

★★★

వెళ్లగానే చెప్పడం బాగోదని నాలుగురోజులు పోయాక పార్వతి విషయం మాటల్లో సుధాకర్‌కి వివరంగా చెప్పాను. వినీ విననట్లుగా ఊరుకున్నాడు సుధాకర్. ఆఫీస్ వర్క్‌లో పడి ఇద్దరం ఆమె విషయం మర్చిపోయాం.

పదిహేను రోజుల తరువాత ఆ రోజు రజిత, పిల్లలు ఊరు నుంచి వచ్చేసారు. మేఘన ఎన్నడూ లేనంత ఉత్సాహంగా ఉండడం, మాటల్లో వంశీ గురించి పార్వతీ ఆంటీ గురించి పదేపదే ఎక్కువగా చెప్పడంతో పార్వతి సాహచర్యం మేఘనలో ఎంత మార్పు తెచ్చిందో తేలిగ్గా గమనించాడు సుధాకర్.

ఆ మర్నాడే మేఘనను, అమ్మను చూసుకుంటూ ఇంట్లో ఉండిపోయే ఒక ఆయాను మాట్లాడాడు.

నర్స్ అవసరం లేకపోవడంతో ఆమెతోపాటు కుక్‌ని కూడా పనిలోంచి తీసేసాడు.

యాభై సంవత్సరాల ఆయా భానుమతమ్మ మేఘనను, అమ్మను చాలా చక్కగా చూసుకోవడంతో సంతోషపడ్డాడు. ఆమె రాకతో కొంత భారం తగ్గినట్లుంది సుధాకర్‌కి.

రోజులు గడుస్తున్నా వంశీని, పార్వతిని మర్చిపోలేదు మేఘన. వాళ్ల గురించి ఏదో ఒక విశేషం సుధాకర్‌కి చెప్తూనే ఉండేది. విని ఊరుకునేవాడు సుధాకర్.

పెళ్లి విషయం కదిపినా అతనిలో ఏ మార్పూ రాకపోవడంతో నేనూ ఆ ప్రస్తావన మానేసాను.

★★★

ఆయా భానుమతమ్మకి ఆరోగ్యం బాగోకపోవడంతో దూరంగా ఉన్న తన కూతురు దగ్గరకు వెళ్లిపోయింది ఆమె.

సుధాకర్‌కి మళ్లీ సమస్య తిరిగి మొదలైంది. సుగుణమ్మగారికి ఓపిక తగ్గిపోవడంతో చేసేదిలేక మరో ఆయా కోసం వెదుకులాట మొదలుపెట్టాడు సుధాకర్.

తలవని తలంపుగా ఆ రోజే మా అత్తగారి నుంచి ఉత్తరం రావడం, దానిలో ఆదిలక్ష్మమ్మగారికి ఆరోగ్యం దెబ్బతిన్నదని, తను పోతే పార్వతికి పెద్ద అండ లేకుండా పోతుందని, ఆమె పార్వతికి మరో పెళ్లి చేయాలనుకుంటున్నారనీ, మొన్న సెలవులకి వచ్చినప్పుడు మేఘనకు తల్లి లేదని తెలిసిందని, పాప తండ్రికి ఇష్టమైతే పార్వతి నిచ్చి పెళ్లి చేద్దామనుకుంటున్నారనీ, ఏ విషయం పాప తండ్రిని అడిగి జాబు వ్రాయవలసిందిగా దాని సారాంశం.

వెదకబోయిన తీగ కాలికి చుట్టుకున్నట్లుగా నా మనస్సులో సంతోషించాను. కానీ సుధాకర్ వివాహానికి ఒప్పుకుంటాడా? తీరా పార్వతి పెళ్లి అయిన తరువాత మేఘనను చూస్తుందని గ్యారంటీ ఏమిటి?


రకరకాల ప్రశ్నలు నాలో తలెత్తుతున్నాయి. కానీ పార్వతిని చూసిన ఆ ఒక్క క్షణం ఎందుకో ఆమె సుధాకర్ కుటుంబంలో ఇమిడిపోయి శ్రీదేవి స్థానానికి న్యాయం చేకూరుస్తుందని అనిపించింది నాకు. ఒకవైపు నుంచి గ్రీన్‌సిగ్నల్ దొరికింది కాబట్టి సుధాకర్‌ని ఎలాగైనా పెళ్లికి ఒప్పించాలనే నిర్ణయానికి వచ్చాను.

అదే విషయం మర్నాడు సుధాకర్ దగ్గర ప్రస్తావించాను. ఇన్నాళ్లుగా అతను మానసికంగా అలసిపోవడం, కుదిరిన ఆయా ఎక్కువరోజులు నిలవకపోవడం, ఇంట్లోని చికాకులతో మనశ్శాంతి లేకుండా వున్న సుధాకర్ మనస్సులో ఏం నిర్ణయించుకున్నాడో పార్వతిని పెళ్లి చేసుకోవడానికి



## నేను చిన్నదాన్ని

హన్సిక హీరోయిన్‌గా 'చండి' సినిమా వస్తుందని ఇటీవల వార్తలు వచ్చాయి. అది 'అరుంధతి' తరహా కథాంశంతో సాగుతుందని ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే అందులో హన్సికకి బదులుగా కాజల్ నటించే అవకాశం వుందని తాజాగా వినిపిస్తున్న నేపథ్యంలో- 'నేనింకా అలాంటి తరహా పాత్రలకు బాగా చిన్నదాన్ని. నా ముఖంలో పసితనం కనిపిస్తుందని చాలామంది చెప్తారు. అందుకనే ఆ సినిమా వద్దనుకున్నాను' అంది హన్సిక.



ఒప్పుకున్నాడు.

"కార్తీ! ఇన్నాళ్లూ మారుటి తల్లి మేఘనను చూస్తుందో చూడదో అనే సంశయంతో ఉన్నాను. కానీ ఒకదాని తరువాత ఒకటిగావచ్చే సమస్యలకు ఇదే తగిన పరిష్కారం అనిపిస్తోంది నాకు. ఒకవేళ ఆమెను చేసుకున్నా మేఘన ఆలనాపాలనా ఎక్కువగా నేనే చూసుకుందామనుకుంటున్నాను. అలాచేస్తే వచ్చే ఆమెకు మేఘన భారం తగ్గి ఏ సమస్యా తలెత్తకపోవచ్చునని నమ్ముతున్నాను'' అన్నాడు.

అసలు పెళ్లికి ఒప్పుకోనివాడు ఇప్పుడు చేసుకుంటాననే తన నిర్ణయం చెప్పడంతో సంతోషంగా ఉన్న నాకు అతనన్న మాటలు ఒక లెక్కలోవిగా అనిపించలేదు.

***

పార్వతి, సుధాకర్‌ల వివాహం నిరాడంబరంగా గుళ్లో జరిగిపోయింది. పార్వతీ ఆంటీ, వంశీ ఇక తమతో ఉండిపోతారన్న విషయం తెలిసిన మేఘన ఆనందానికి హద్దులులేవు.

మేఘన సంతోషం చూసి తృప్తిగా నిట్టూర్చాడు సుధాకర్. వెంటనే ట్రాన్స్‌ఫర్ అవడం కష్టం కనుక ఉద్యోగానికి లాంగ్‌లీవ్ పెట్టింది పార్వతి. మొదటి చూపులోనే పార్వతి ఒద్దికైన మనిషి అని గ్రహించిన సుగుణమ్మ కొడుకు జీవితం ఒక దరికి చేరిందని సంతోషించింది.

తీరిక సమయాల్లో మేఘనకు చదువు చెప్పడం, అత్తగారికి భారత, భాగవతాలు చదివి వినిపించడంతో రోజులు ఇట్టే గడిచిపోతున్నాయి పార్వతికి. కూతురు కాపురం దగ్గరుండి ఓ నెలరోజులు చూసిన ఆదిలక్ష్మమ్మ తృప్తిగా తన ఊరు చేరుకుంది.

వంశీ కూడా ఓ నెలరోజుల్లోనే సుధాకర్‌కి బాగానే చేరిక అయ్యాడు. నాన్నా నాన్నా.. అని అతని వెంటే తిరుగుతూ ముద్దుగా ఉన్న వంశీని చూస్తే సుధాకర్‌కి ముచ్చటగానే ఉంది.

***

ఆరోజు ఆదివారం కావడంతో రజిత, పిల్లలతో సుధాకర్ ఇంటికి వెళ్లారు.

ఇన్నాళ్లూ పాడుబడిన దేవాలయంలా ఉన్న ఆ ఇల్లు పార్వతి రాకతో కళకళలాడుతోంది.

సుధాకర్ కూడా ఉషారుగానే కనబడ్డాడు. పార్వతితో అతనికి పెళ్లికి ఒప్పించి చేయడంలో నేను ఏమీ పొరపాటు చేయలేదనే నమ్మకం వచ్చింది నాకు. మాటల సందర్భంలో సుధాకర్ కొత్త జీవితం గురించి ఆరా తీసాను.

"కార్తీ! పార్వతిని చేసుకుని నేనేమీ తప్పు చేయలేదురా. చిన్న వయస్సులో ఆమె భర్తను కోల్పోయింది. సుఖంకంటే కష్టాన్నే చవి చూసింది. తండ్రిలేని ఆమె బిడ్డకు తండ్రి ప్రేమ చూపితే, తల్లిలేని నా పాపకు తల్లి ప్రేమ ఆమె అందిస్తుందనే నమ్మకంతో వంశీని నా స్వంత బిడ్డలా చూసుకుంటున్నాను. ఇందులో నా స్వార్థం పాలు కొంచెం ఉన్నా తేడా చూపించకుండా సర్దుకుపోతే మన జీవితం సుఖమయం చేసుకోవచ్చుకదా'' అన్నాడు.

సుధాకర్ మాటల్లోని తృప్తి నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది.

మా అందరికీ కాఫీలు అందిస్తున్న పార్వతితో మాట కలిపి "ఏమ్మా! మా సుధాకర్ నిన్ను బాగా చూసుకుంటున్నాడు. అతను నీకు నచ్చాడా?'' సరదాగా అన్నాను.

"అగమ్యగోచరంగా ఉన్న నా జీవితానికో అర్థం కల్పించారు అన్నయ్యగారూ. నేను చాలా సంతోషంగా ఉన్నాను. తల్లిలేని మేఘనకు తల్లి ప్రేమ అందిస్తే తండ్రిలేని వంశీకి తండ్రి ప్రేమ దొరుకుతుందని ఆశించి మేఘనను నా కన్నబిడ్డలా అనుకుంటున్నాను. తేడా చూపక సర్దుకుపోతే మా సంసారం సుఖమయం అవుతుందనే అనుకుంటున్నాను. నాలో ఈ స్వార్థం ఉన్నా నా స్వార్థాన్ని మంచికే వినియోగిస్తున్నాననుకుంటున్నాను'' అన్నది పార్వతి.

ఏ గూటి పక్షులు ఆ గూటి పలుకులే పలుకుతాయన్నట్లు ఒకే బాటలో నడిచిన ఈ బాటసారులు దారులు వేరవకుండా ఒకే గమ్యానికి చేరుకున్నందుకు చాలా సంతోషించాను నేనూ, రజిత.

పార్వతి మాటలు విన్న సుధాకర్ తృప్తిగా నిట్టూర్చాడు.

★



## దొరికిన బస్టర్డ్ బర్డ్

30 ఏళ్లనాడు గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ బర్డ్ జాతి అంతరించిపోయిందని శాస్త్రజ్ఞులు భయపడ్డారు. అయితే ఇటీవల తాల్‌చాపర్ సాంక్చురీలో హఠాత్తుగా ఓ పక్షుల జంట కనిపించి జంతుశాస్త్రజ్ఞుల్ని ఆశ్చర్యానందాలలో తేలియాడించింది. వాటిని టూరిస్టుల కళ్లబడకుండా ప్రత్యేక స్థావరాల్లో జాగ్రత్తగా పెరిగే ఏర్పాట్లు చేసారుట.

-తటవర్తి

